క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఉయ్యాలవాడ : మండలంలోని సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీ నరసింహ కంబగిరిస్వామి, శ్రీ అభయాంజనేయస్వామి, శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు వేకువజామునే ప్రత్యేక అభిషేకాలు, సామూహిక కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు ఆలయాల మూసివేత

నంద్యాల(వ్యవసాయం): చంద్రగ్రహణం కారణంగా ఆదివారం ఆలయాలు మూ సివేస్తున్నట్లు ఆలయాల ఈఓలు లక్ష్మీనారాయణ, రామానుజన్, వేణునాథ్ రెడ్డి శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని బయటిపేటలోని ఆంజనేయ స్వామి దేవస్థానం,శ్రీ కాళికాంబ దేవస్థానం, బ్రహ్మనందీశ్వర స్వామి దేవస్థానం, మూలమట్టం, మల్లికార్జున స్వామి దేవస్థానం, గుడిపాడుగడ్డలోని వేకటేశ్వర స్వామి దేవస్థానం, ప్రథమనందీశ్వర స్వామి ఆలయాలను మూసివేస్తున్న చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి సోమవారం ఉదయం ఆలయాల శుద్ధి 8 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తామని వివరించారు.

ఉయ్యాలవాడ : చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం సాయంత్రం నుంచి ఆలయాలు మూసివేయనున్నట్లు అర్చకులు లక్ష్మణస్వామి, అనంతయ్య తెలిపారు. సాయంత్రం 6 నుంచి సోమవారం తెల్లవారుజామున 4 గంటల వరకు ఆలయాలు మూసివేయడం జరుగుతుందన్నారు. తెల్లవారుజామున ఆలయాల్లో సంప్రోక్షణ అనంతరం స్వామి వార్లకు అభిషేకాలు చేసి పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం ఆలయాల్లో భక్తులకు దర్శనం కల్పించడం జరుగుతుందని వెల్లడించారు.

నిధుల విడుదల

ఉయ్యాలవాడ : గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘానికి సంబంధించి 2024–25 సంవత్సరానికి రెండవ విడత నిధులు మంజూరైనట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు శనివారం తెలిపారు. గ్రామ పంచాయతీల వారీగా వివరాలు.. అల్లూరు రూ. 2,19,060, బోడెమ్మనూరు రూ. 1,66,576, గోవిందపల్లె రూ.51,771, హరివరం రూ.2,60,404, ఇంజేడు రూ. 1,46,520, కాకరవాడ రూ.1,40,486, కొండుపల్లె రూ.97,112, మాయలూరు రూ.1,59,091, నర్సిపల్లె రూ. 80,188, పడిగెపాడు రూ.65,740, పెద్దయమ్మనూరు రూ.1,86,338, పుచ్చకాయలపల్లె రూ. 41,490, ఆర్.జంబులదిన్నె రూ.1,24,695, ఆర్.పాంపల్లె రూ.1,21,441, రూపనగుడి రూ. 1,18,574, సర్వాయిపల్లె రూ. 1,00,294, సుద్దమల్ల రూ.64,557, ఎస్.కొత్తపల్లె రూ.41,969, తుడుమలదిన్నె రూ.1,24,478, ఉయ్యాలవాడ గ్రామ పంచాయతీకి రూ.3,11,189 మంజూరైనట్లు ఎంపీడీఓ వివరించారు

బహుమతుల అందజేత

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లా అల్ మేవ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఖాదరబాదర్ మున్సిపల్ హై స్కూల్‌లో మిలాద్ ఉన్ నబీ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఇమ్రాన్ బాషా గౌరవ అధ్యక్షుడు మహమ్మద్ మాట్లాడుతూ 8, 9, 10వ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించగా.. 76 మంది పాల్గొన్నారు. ఇందులో 17 మందికి బహుమతులు అందజేశారు. అలాగే ఉత్తమ ఉపాధ్యాయులు ఆసిఫ్ షోయబు జమాన్, అలియాను సన్మానించారు. అసదుల్లా హుసేని, ఆసిఫ్ ఇషాక్, అబ్దుల్లా రసాధి, మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

కలహాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దు

గోస్పాడు: చిన్నచిన్న కలహాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ సుధాకర్ రెడ్డి అన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో మనస్విని ప్రోగ్రాం ప్రారంభించామన్నారు. స్టేషన్‌లో ఉమెన్ డెస్క్ ఏర్పాటు చేసి వివాహ కౌన్సెలింగ్‌పై అవగాహన కల్పించారు.

వేంకటేశ్వరుడికి విశేష పూజలు



వేలంలో లడ్డూను దక్కించుకున్న భక్తుడు

రుద్రవరం: మండల పరిధిలోని కొండమాయపల్లె పంచాయతీ మజరా గ్రామమైన వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీగోదా సమేత వాసాపురం వేంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు మధుసూదనరెడ్డి, రంగనాయకులు, నరసింహులు ఆధ్వర్యంలో అర్చకులు స్వామి అమ్మవార్లకు నిత్య పూజలు గావించిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం కుంకుమార్చన పూజలు గావించారు. పూజా కార్యక్రమాలు ముగియగానే ఆలయ ప్రాంగణంలో వినాయక చవితి పండుగ సందర్భంగా కొలువుదీర్చిన వినాయక విగ్రహానికి పూజలు చేశారు. 11 రోజుల పూజ అనంతరంస్వామి వారి సన్నిధిలోని లడ్డు ప్రసాదాన్ని శనివారం వేలం వేశారు. వేలంలో గిద్దలూరుకు చెందిన గోవిందరెడ్డి, మంగమ్మ గారి కుమారుడు పుల్లారెడ్డి రూ.50వేలకు వేలం పాడి లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నాడు. వేలం ముగియగానే భక్తాదులంతా కలిసి సంబరంగా ఒకరిపై మరొకరు రంగులు చల్లుకుంటూ ఆలయ ప్రాంగణంలో ఉన్న కోనేరులో వినాయక నిమజ్జనం గావించారు.

యూరియా అందేనా.. పంటలు పండేనా

- యూరియా కోసం రైతుల అవస్థలు
- గంటల కొద్దీ పడిగాలుపు కాయాల్సిన పరిస్థితి
- దొరికేది ఒకటి లేదా రెండు బస్తాలే
- ఇది పంటలకు ఏమాత్రం సరిపోదని అన్నదాతల ఆవేదన



రుద్రవరంలో వీఆర్వో సమక్షంలో రైతులకు స్లిప్‌లు ఇస్తున్న వ్యవసాయ సిబ్బంది





పోలీసు బందోబస్తు మధ్య చెన్నూరు రైతు సేవా కేంద్రంలో యూరియాను అన్‌లోడ్ చేయిస్తున్న దృశ్యం , యూరియాకు క్యూలో ఉన్న రైతులు

రుద్రవరం: యూరియా కోసం రైతులకు అవస్థలు తప్పడంలేదు. గంటల కొద్ది రైతు సేవా కేంద్రాల వద్ద పడి గాపులు కాస్తే ఒకటి లేదా రెండు బస్తాలు మాత్రమే దొరుకుతోంది. ఇలా అయితే వరి పండించేదెలా అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పోలీసుల సమక్షంలో పంపిణీ

మండల కేంద్రమైన రుద్రవరం, చిన్నకంబలూరు, పెద్దకంబలూరు, ముత్తలూరు, పేరూరు తదితర గ్రామాల రైతు సేవా కేంద్రాలకు శనివారం యూరియా బస్తాలు వచ్చాయి. విషయం తెలియగానే ఆయా గ్రామాల రైతులు పరుగులు తీసి క్యూ కట్టారు. అయితే రైతుల సంఖ్య అధికంగా ఉండటంతో పంపిణీ కష్టం అవుతుందని వ్యవసాయ శాఖ సిబ్బంది వీఆర్వోలు, పోలీసుల సమక్షంలో పంపిణీ కార్యక్రమం చేపట్టారు. యూరియా వచ్చిన స్టాకును బట్టి ఒక్కో రైతుకు ఒకటి లేదా రెండు బస్తాలు మాత్రమే పంపిణీ చేశారు. బయట దుకాణాల్లో కొనుగోలు చేద్దామంటే ధర ఆకాశాన్నంటుతోందని, రైతు సేవా కేంద్రాల ద్వారా నిర్ణీత ధరకు అవసరమైనంత యూరియా దొరుకుతుందనుకుంటే ఒకటి రెండు ఇస్తే ఏమి చేయాలని కూటమి ప్రభుత్వంపై రైతులు మండిపడుతున్నారు. వ్యవసాయశాఖ సిబ్బంది మాత్రం మరి కొద్ది రోజుల్లో యూరియా మళ్లీ వస్తుందని చెబుతున్నారు. అయితే అప్పుడు కూడా ఒకటి రెండే కదా.. ఇలా అయితే పంటలు ఎలా పండించుకోవాలని ఆయా గ్రామాల రైతులు ఆవేదన చెందారు.

పోలీస్ బందోబస్తు మధ్య యూరియా తరలింపు

శిరివెళ్ల: యూరియా లారీలు దారి మళ్లకుండా పోలీస్ బందోబస్తుతో శనివారం నంద్యాల రైల్వేస్టేషన్ నుంచి రైతు సేవా కేంద్రాలకు చేరుకున్నాయి. చెన్నూరు, బోయలకుంట్లలో 23 మెట్రిక్ టన్నులు యూరియాను ఒకొక్క పట్టాదారు పాస్ పుస్తకానికి రెండేసి బస్తాలను రైతుకు అందజేశారు. ఏఓ సుధాకర్, తహసీల్దార్ జయశ్రీ బస్తాల పంపిణీని పర్యవేక్షంచారు.

యూరియా నిల్వల తనిఖీ

ఉయ్యాలవాడ : మండలంలోని మూడు రైతు సేవా కేంద్రాలు, గ్రోమోర్ కేంద్రానికి 72 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చినట్లు మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం మన గ్రోమోర్ కేంద్రానికి చేరిన యూరియాను తహసీల్దార్ సువర్ణాదేవి, ఏఓలు పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ మండలంలో 11 రైతు సేవా కేంద్రాలు ఉండగా 8 రైతు సేవా కేంద్రాలకు యూరియా సరఫరా కావాల్సి ఉందన్నారు. వీటికి కూడా ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు సుదర్శన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు, విఆర్ఓలు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల బారులు

- పసురపాడులో పోలీసు బందోబస్తు మధ్య యూరియా పంపిణీ
- కౌలు రైతులకు యూరియా అందక అవస్థలు



యూరియా కోసం క్యూలో ఉన్న రైతులు

గోస్పాడు: పంటల సాగు చేశాక అవసరమైన యూరియా మందు కోసం రైతులు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో మొదటి నుంచి యూరియా సరఫరాను అధికారులు సక్రమంగా చేయకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలో రెండో రోజు పసురపాడు గ్రామంలో పోలీసు బందోబస్తు మధ్య అందజేశారు. శనివారం పంపిణీ కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ మొహిద్దీన్, వ్యవసాయాధికారి స్వప్నికారెడ్డి పంపిణీ చేశారు. గ్రామానికి 496 బస్తాలు యూరియా మంజూరైందని, పాస్ పుస్తకాలు ఉన్న సంబంధిత రైతులే అక్కడికి రావాలని సూచించారు. ఇక కౌలు రైతుల పరిస్థితి అధ్వానంగా మారింది. రైతుల పాసు పుస్తకాలు తెచ్చి చూపినా ఎరువులు అందక పోవడంతో ఇక్కట్లు పడుతున్నారు.

మహిళలపై వివక్ష తగదు



జెండర్ రిసోర్స్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి

గోస్పాడు: మహిళలపై వివక్షత అని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో జెండర్ రిసోర్స్ సెంటర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. మహిళలను వివక్షకు గురిచేసినా, దుర్భాషలాడినా, అక్రమంగా తరలించినా, హక్కులకు భంగం వాటింపజేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్యాయం జరిగిన వారు రిసోర్స్ సెంటర్‌లో సంప్రదించాలని తెలిపారు. ఇక్కడ ఫిర్యాదు చేస్తే వారి సమస్యలను పోలీసుల ద్వారా పరిష్కరిస్తామన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ఆర్టీసీలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేసి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య, ఏఐటీయూసీ డిప్యూటీ కార్యదర్శి మురళీధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నంద్యాల ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు 50 మంది ఏఐటీయూసీలో చేరారన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.గౌరవాధ్యక్షుడిగా శ్రీనివాసులు, అధ్యక్షుడిగా శివ, ప్రధాన కార్యదర్శిగా గౌస్ పీరా, ఉపాధ్యక్షులుగా రాజు, ఆశీర్వదమ్మ, పవన్, సహాయ కార్యదర్శులుగా మరియమ్మ, కృపావతి, కోశాధికారిగా హుసేన్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, మెడికల్ కాంట్రాక్ట్ జిల్లా అధ్యక్షురాలు సుశీలమ్మ పాల్గొన్నారు.

బాలల నృత్యార్చన





శాస్త్రీయ నృత్యం చేస్తున్న బాలలు

నంద్యాల(వ్యవసాయం): కళారాధన నంద్యాల ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కతిక శాఖ సృజనాత్మక సంస్కృతి సమితి సహకారంతో, లయన్స్ క్లబ్, ఐఎంఏ సంయుక్త నిర్వహణలో జరుగుతున్న మాతృ భూమికి కళార్చనలో భాగంగా శనివారం స్థానిక టౌన్‌హాల్‌లో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో శాస్త్రీయ, జానపద సోలో, బృంద నృత్యాల పోటీలు అలరించాయి. కళారాధన ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవికృష్ణ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది వెదుర్ల రామచంద్రరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రామచంద్రరావు మాట్లాడుతూ కళారాధన సేవలను అభినందించారు. పోటీలకు విజయవాడకు చెందిన శ్రీమన్నారాయణ న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. రెండు వందల మంది పైగా నంద్యాల, ఆదోని, కర్నూలు, అనంతపూర్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన బాలల నృత్యం ప్రదర్శించారు. జనార్ధన్ నాగరాజు మధు, రవిప్రకాష్, వెంకటేశ్వర్లు, ఇస్మాయిల్, సూర్య పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై ప్రజలను అప్రమత్తం చేయాలి



మాట్లాడుతున్న కాంతరావునాయక్

గోస్పాడు:క్యాన్సర్ వ్యాధిపై ప్రజలను అప్రమత్తం చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ అన్నారు. నంద్యాల సర్వజన ఆసుపత్రి ఆవరణలోని ఎంసీహెచ్ బ్లాక్ సమావేశ భవనంలో శనివారం జిల్లా ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కాంతరావునాయక్ ఆధ్వర్యంలో రెండో విడత వైద్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఎన్‌సీడీసీడీ 4.0 సర్వేలో భాగంగా క్యాన్సర్ స్క్రీనింగ్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 3.0 క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వే నిర్వహించారని చెప్పారు. జిల్లాలోని 138 మంది వైద్యులకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మొదటి విడతగా 42 మందికి, రెండో విడత 43 మంది వైద్యులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సుదర్శన్‌బాబు, ఏఓ డాక్టర్ భరత్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యలపై గళమెత్తిన ప్రజా ప్రతినిధులు



సమస్యలపై మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

శిరివెళ్ల: తమ గ్రామాలలో నెల కొన్న సమస్యలపై ప్రజా ప్రతినిధులు గళమెత్తారు. శనివారం ఎంపీపీ నాయక్ వసీం అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. వీరారెడ్డిపల్లె సర్పంచు మందాల రాధిక మాట్లాడుతూ.. ఎన్టీర్ హౌసింగ్ స్కీం కింద నిర్మించుకున్న ఇళ్లకు ఇంత వరకు బిల్లులు పడలేదన్నారు. అప్పులు చేసి కట్టుకున్న లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రైవేట్ అప్పుదారులు ఇళ్లకు నోటీసులు అతికిస్తున్నారన్నారు. అలాగే ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా మారిందన్నారు. యూరియా అందరికీ అందడంలేదన్నారు. యూరియా అందరికి అందేలా చూడాలని బోయలకుంట్ల సర్పంచు జింకల నాగన్న కోరారు. ఏఓ సుధాకర్ స్పందించి మండలంలో 24 వేల ఎకరాలలో వరి పంట సాగయ్యిందని ఇంత వరకు 1344 టన్నుల యూరియా పంపిణీ జరిగిందని తెలిపారు. రైతులందరికీ అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. యూరియా స్థానంలో నానో యూరియా వాడాలని ఏఓ తెలిపారు. ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, తహసీల్దార్ జయశ్రీ, పశువైద్యాధికారి దస్తగిరి, పీఆర్ ఏఈ రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ త్రిలింగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మార్గదర్శకులు కావాలి



శాంతి మంత్రం జపిస్తున్న కలెక్టర్

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు చదువుతో పాటు పాఠ్యేతర కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభ ద్వారా భవిష్యత్ తరాలకు మార్గదర్శకులుగా నిలవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సూచించారు. పట్టణంలోని శ్రీ శారదా విద్యాపీఠం ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన గణిత విజ్ఞానమేళా, సాంస్కృతిక మహోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జ్ఞానానికి కంటే పవిత్రమైనది ప్రపంచంలో ఏదీ లేదని, విద్య కేవలం మార్కులు సాధించేందుకే కాకుండా ఉన్నత విలువలను పెంపొందించుకోవడానికి ఉపయోగపడాలన్నారు. విద్యార్థుల గుణగణాలను వెలికి తీయడంలో ఉపాధ్యాయుల పాత్ర అద్భుతమన్నారు.అనంతరం పాఠశాల కమిటీ సభ్యులు కలెక్టర్‌ను సత్కరించారు. డీఈఓ జనార్దన్‌రెడ్డి, విద్యా భారతి సంఘటన కార్యదర్శి కన్నా భాస్కర్, విద్యా భారతి ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి ప్రతాపసింహ శాస్త్రి, అనంతపురం సరస్వతి విద్యాపీఠం సమితి అధ్యక్షుడు గడ్డం రామకృష్ణారెడ్డి, పాఠశాల మేనేజర్ వసుంధర దేవి, ప్రధానోపాధ్యాయుడు వెంకటకృష్ణయ్య పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



సన్మానం చేస్తున్న ప్రిన్సిపాల్

శిరివెళ్ల: యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇరువురికి జిల్లా ఉత్తమ అధ్యాపక అవార్డులు వచ్చాయి. ఈ మేరకు శనివారం అవార్డు గ్రహీతలు అంజయ్య చౌదరి, బాల చింతలయ్యను ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, తోటి అధ్యాపకులు సన్మానించారు. అలాగే విద్యార్థులకు యూనిఫారం కోసం ప్రవాసంధ్రుడు మోహన్‌రెడ్డి రూ.42 వేలు విరాళంగా అందజేశారు. విరాళం కోసం చొరవ చూపిన అధ్యాపకుడు బాల చంద్రుడును సన్మానించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించండి



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: జిల్లాలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం తన కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు సుమారుగా 50వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగు చేసున్నతారని, రానున్న రోజుల్లో లక్ష ఎకరాలకు పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఈ పద్ధతిలో కలిగే ప్రయోజనాలను వివరిస్తూ తక్కువ పెట్టుబడితో నాణ్యమైన ఉత్పత్తులను సాధించడం, ఆదాయంపై రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ముఖ్యంగా పొలాల్లో వేసే పంట కంటే గట్ల మీద వేసిన పంట ద్వారానే అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. అలాగే.. అంగన్వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్‌లో ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. క్లస్టర్ వారీగా ఒక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ అధికారి (ఇన్‌చార్జి) మద్దిలేటి, హార్టికల్చర్ అధికారి నాగరాజు, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, సెరికల్చర్ అధికారి నాగేష్, ఐసీడీఎస్ పీడీ లీలావతి దేవి పాల్గొన్నారు.

జిల్లాకు 5200 మెట్రిక్ టన్నుల యూరియా

జిల్లాకు 5,200 మెట్రిక్ టన్నుల యూరియా చేరిందని జిల్లా కలెక్టర్ రాజకుమారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చేరుకున్న యూరియాలో రైతు సేవా కేంద్రాలకు 3,200 మెట్రిక్ టన్నులు చేరిందన్నారు. మిగిలిన రెండు వేల మెట్రిక్ టన్నులు రిటైలర్స్‌కు సరఫరా చేశామన్నారు. రైతులకు సరిపడా యూరియా రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉందన్నారు. ఈనెల 9వ తేదీన 2,600 మెట్రిక్ టన్నులు, 12న మరో 1,500 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రానుందని పేర్కొన్నారు. రైతులు ఎవరు ఆందోళన చెందొద్దని కోరారు. డీలర్లు యూరియాను ఎమ్మార్పీకే రైతులకు విక్రయించాలని, కృత్రిమ కొరత సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకించాలి

నంద్యాల(న్యూటౌన్): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సాయిబాబానగర్ సెంటర్‌లో అమెరికా టారిఫ్‌ల పెంపునకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. లక్ష్మణ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ భారతీయ సరకుల దిగుమతులపై సుంకాన్ని 50 శాతానికి పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ప్రకటించడంతో మన ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. ఆక్వా, టెక్స్‌టైల్స్, గార్మెంట్స్ వంటి ఉత్పత్తులు ఘోరంగా పడిపోయాయన్నారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు చౌడప్ప, నాగరాజు, నాగమరాముడు, నాయకులు రామచంద్రుడు, తోటమద్దులు, మురళీధర్, మహమ్మద్ గౌస్, లక్ష్మీదేవి, శ్రీనివాసులు, హరినాథ్ పాల్గొన్నారు.

అహోబిలేశుడి సేవలో గంగుల



స్వామి వారి సన్నిధిలో గంగుల ప్రభాకర్ రెడ్డి

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామిని మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి దంపతులు, మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు వారికి తీర్థప్రసాదాలను అందజేశారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

దొర్నిపాడు: మండల కేంద్రంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శింగవరం క్రిష్టారెడ్డి తెలిపారు. భగవాన్ శ్రీ సత్యసాయిబాబ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఉదయానంద వైద్యశాలకు చెందిన వైద్యులతో చాకరాజు వేముల గ్రామానికి చెందిన గంగవరం రాధికా కృష్ణారెడ్డి సహకారంతో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న జడ్జి భాస్కర్

ఆళ్లగడ్డ: ఈనెల 13న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి భాస్కర్ కోరారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో ఆయన పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లోక్‌అదాలత్ దీర్ఘకాలికంగా పెండింగ్ కేసుల పరిష్కారానికి చక్కటి వేదిక అన్నారు. డీఎస్పీ ప్రమోద్, ఏపీపీ శివప్రసాదరావు, బాలగురెడ్డి పాల్గొన్నారు.

ఆర్ఎస్‌కేలకు 3,245 మెట్రిక్ టన్నుల యూరియా

నంద్యాల(అర్బన్): జిల్లాకు వచ్చిన 5,200 మెట్రిక్ టన్నుల యూరియాలో జిల్లాలోని 162 రైతు సేవా కేంద్రాలకు 3,245 మెట్రిక్ టన్నులు మార్క్‌ఫెడ్ ద్వారా సరఫరా చేశామని ఇన్‌చార్జ్ డీఏఓ మద్దిలేటి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే 1,955 మెట్రిక్ టన్నులు ప్రైవేటు డీలర్లకు అందజేశామన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

నంద్యాల: అపార్టుమెంట్‌పై నుంచి దూకి వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం పట్టణంలో చోటు చేసుకుంది. త్రీటౌన్ సీఐ కంబగిరిరాముడు తెలిపిన మేరకు వివరాలు.. సాయిబాబానగర్ నుంచి రైల్వే స్టేషన్ రహదారిలోని అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న సుబ్బమ్మ (70) అనారోగ్య సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడింది. ఐదు సంవత్సరాల క్రితం సుబ్బమ్మకు మోకాళ్ల ఆపరేషన్ జరిగినప్పటి నుంచి మానసిక పరిస్థితి సరిగా లేదని, సైకాలజిస్ట్ వద్ద చూపించినా మార్పు లేదన్నారు. మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి భర్త సుబ్బరాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

దోమల నివారణకు కృషి చేయాలి

గోస్పాడు: దోమలతో విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ వాటి నివారణకు కృషి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ అన్నారు. శనివారం పట్టణంలోని సర్వజన ఆసుపత్రి ఎంసీహెచ్ బ్లాక్ సమావేశ భవనంలో జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖర్‌రావు ఆధ్వర్యంలో వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ కిరణ్, జిల్లా ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కాంతరావునాయక్ పాల్గొన్నారు.

బొలెరో బోల్తా.. 12 మందికి గాయాలు

ఆళ్లగడ్డ: అహోబిలంలోని ఓం నమో నారాయణ టర్నింగ్ వద్ద బొలెరో వాహనం ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తా పడింది. వైఎస్సార్ కడప జిల్లా పెండ్లిమర్రి మండలం కొండూరు గ్రామానికి చెందిన భక్తులు దిగువ అహోబిలం నుంచి ఎగువ అహోబిలం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. దీంతో ఆనందమ్మ, దేవి, వెంకటసుబ్బయ్య, బషీరూన్, నరసమ్మ, కల్యాణమ్మ మరో ఆరుగురికి గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రూరల్ పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నంద్యాల(న్యూటౌన్): బండిఆత్మకూరు మండలంలోని పెద్దదేవళాపురం గ్రామంలో వెలసిన అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి రావూస్ జూనియర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు రూ.17,916ను కళాశాల చైర్మన్ అప్పారావు అందజేసినట్లు ప్రిన్సిపాల్ సుంకన్న శనివారం తెలిపారు.